క్లుప్తంగా

పరీక్షకు 12 మంది గైర్హాజరు

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రంలో మంగళవారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సర ఇంగ్లిష్ పరీక్షకు 12 మంది గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. మొత్తంగా 423 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 411 మందే హాజరయ్యారన్నారు. సిట్టింగ్ స్క్వాడ్ ఎస్.విజయ్‌కుమార్, కె.ఉమా శంకర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

రంగంపేట: మండల పరిధిలోని ఎస్టీ రాజాపురం, వడిశలేరు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయ, రైతు భరోసా, వెల్‌నెస్ కేంద్రాల భవనాలను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బుధవారం ప్రారంభిస్తారని మండల పంచాయతీరాజ్ శాఖ జేఈ కె.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి కిట్ల అందజేత



కొంకుదురులో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందించిన పూర్ణ ఫౌండేషన్ మిత్ర బృందం

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పూర్ణ ఫౌండేషన్ మిత్ర బృందం పరీక్ష సామగ్రి కిట్లను అందజేశారు. 2008–09లో పాఠశాలలో పదో తరగతి చదువుకున్న విద్యార్థి ఇమ్మంది పూర్ణకుమార్ జ్ఞాపకార్థం అతడి స్నేహితులు ఈ కిట్లను పంపిణీ చేశారు. దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చక్కటి ప్రతిభను కనబరచాలని ఎంఈవో–2 పూర్ణచంద్రరావు అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, పూర్ణ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కజొన్న విత్తనాలపై సదస్సు

సీతానగరం: మండలంలోని చినకొండేపూడిలో మొక్కజొన్న విత్తనాలపై పైనీర్ కంపెనీ ప్రతినిధులు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మేడిశెట్టి సత్యనారాయణ పొలంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కంపెనీ టెక్నికల్ అసిస్టెంట్ నాంగేంద్ర, డీలర్ పోలినాటి ఈశ్వరుడు పాల్గొన్నారు. పి– 3567 రకం హైబ్రిడ్ మొక్కజొన్న వంగడం గురించి వివరించారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి

రాజానగరం: విద్యార్థులకు సకాలంలో సిలబస్ పూర్తిచేసి, మిగిలిన సమయంలో రివిజన్ చేస్తే ఉత్తమ ఫలితాలను అందుకునేందుకు అవకాశం ఉంటుందని రాజమహేంద్రవరం డిప్యూటీ డీఈఓ బీఎల్ నారాయణ ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. 8, 9 తరగతులను పరిశీలించి, బోధనా తీరును, విద్యార్థుల పఠనాశక్తిని పరిశీలించారు. నాడు – నేడు పథకం ఫేజ్ 2లో మంజూరైన నిధులతో చేపట్టిన అదనపు తరగతుల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. పదో తరగతి పరీక్షలకు ఉపయోగపడే విధంగా సత్వరమే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ రామన్నదొరను ఆదేశించారు.

మహిళలకు కుట్టు శిక్షణ



శిక్షణ పొందుతున్న మహిళలు

రాజానగరం: దివాన్ చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని మల్లంపూడిలో టైలరింగ్ శిక్షణా కార్యక్రమాన్ని ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. ఈవూరి దుర్గ ట్రైనర్‌గా వ్యవహరిస్తున్న ఈ శిక్షణకు 55 మంది మహిళలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పూర్తి



చినకొండేపూడిలో పిల్లలను పరిశీలిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఇంటింటి సర్వే మంగళవారంతో పూర్తయ్యిందని పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. ఆయన తన సిబ్బందితో చినకొండేపూడిలో ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు. మండలంలో ఐదేళ్ల లోపు పిల్లలు 5,689 మంది ఉండగా తొలిరోజు 96 శాతం పోలియో చుక్కలు వేశామన్నారు. రెండు రోజులు ఇంటింటి సర్వే నిర్వహించి నూరుశాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. అయితే ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చిన పిల్లలకు చుక్కలు వేయడం ద్వారా 100.2 శాతం విజయవంతమైందన్నారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

మెట్టలో రబీ కోతలకు సన్నద్ధం

- ఆశాజనకంగా వరి పంట
- కోతలకు సిద్ధంగా పొలాలు

రాజానగరం: సాగు నీటి సదుపాయాలు సమృద్ధిగా లేకపోయినా, భూగర్భ జలాలనే నమ్ముకున్న మెట్ట ప్రాంతంలోని అన్నదాతలు వరిపంట సాగులో తమ ప్రతిభను ప్రతి సీజన్‌లోనూ కనబరుస్తూనే ఉన్నారు. జిల్లాలో నిన్న మొన్నటి వరకు రబీ సీజన్‌కి సంబంధించిన వరి పంటకు నాట్లు వేయడం జరుగుతూనే ఉంది. ఇంతలోనే మెట్ట ప్రాంతంలో వరి పంట కోతకు సిద్ధమైంది. మరో రెండు మూడు రోజులలో కోతలు ప్రారంభం కానున్నాయి. నిర్ణీత వ్యవధిలో సాగుకు సమాయత్తం కావడం వల్లనే ప్రతి సీజన్‌లోను మెట్ట రైతులు ముందంజలో ఉండగలుగుతున్నారనేది వాస్తవ చిత్రం.

చాగల్నాడు ప్రాంతంలో..

చాగల్నాడుగా పిలువబడే ఈ ప్రాంతంలో నరేంద్రపురం, తూర్పుగానుగూడెం, కలవచర్ల, రాజానగరం, వెలుగుబంద, కాకినాడ జిల్లాలోని మురారి, గండేపల్లి, వడిశలేరు, ప్రాంతాలలో వరి పంట కోతలకు పొలాలు సిద్ధంగా ఉన్నాయి. ఏపుగా పండిన వరి పైరుకు ధాన్యం గింజలు వేసి, బంగారు వర్ణంతో పొలాలు నిగనిగలాడుతున్నాయి. సీజన్ ఏదైనా తదే ముందంజ అనే ఈప్రాంత రైతులు ఈసారి కూడా అదే ఒరవడిని కొనసాగిస్తూ, రబీ వరి పంట కోతలకు సమాయత్తమవుతున్నారు. ఈ ప్రాంతంలో రబి వరిసాగు సుమారు 15,685 హెక్టార్లలో చేపట్టగా, ప్రస్తుతం 2,875 హెక్టార్లలో వరి కోతలు పొలాలు సిద్ధంగా ఉన్నాయి. వారం రోజుల వ్యవధిలో ఇక్కడ వరి కోతలు ముమ్మరంగా జరిగేందుకు అవకాశాలున్నాయి.

మంచి దిగుబడులు వచ్చే అవకాశం

ఎక్కువ శాతం మంది రైతులు 90 రోజుల కాల వ్యవధితో కూడిన ఆర్ఎన్ఆర్ 15048 వరి వంగడంతోపాటు సన్న రకాలైన పెరల్ వంటి కొన్ని ప్రైవేట్ రకాలను ఎక్కువగా సాగు చేశారు. ప్రస్తుతం ఆయా పొలాలలోనే కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రస్తుత సీజన్‌లో ఎటువంటి తెగుళ్ల బెడద లేకుండా ఏపుగా పెరిగి పైరు నుంచి ఎకరాకు 50 బస్తాల వరకు దిగుబడులు వస్తాయని ఆశిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ధర కూడా అనుకూలంగానే ఉంది. గత సీజన్‌లో 75 కిలోల బస్తా ధాన్యం ధర రూ. 1650 పలికితే ఈ రబీలో రూ. 1850లు ఉంది.



కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాలు

భూసారాన్ని పెంచేలా కృషి చేయాలి



వ్యవసాయంలో జిల్లాలో అందరికంటే ముందుంగానే ఉంటున్న మెట్ట రైతులు భూసారాన్ని వృద్ధి చేయడంలో కూడా శ్రద్ధ వహించాలి. ఇందుకుగాను పిల్లిపెసర, జీలుగ వంటి వాటిని మూడో పంటగా సాగుచేసి, భూసారాన్ని పెంచేందుకు అవకాశం ఉంటుంది. అలాగే మన పూర్వీకుల మాదిరిగా సాగు సమయంలో పశువుల పెంటను వేయడం కూడా మంచిది. వరి పంట కోతలు చేపట్టక ముందే పచ్చిరొట్ట విత్తనాలు చల్లడం మంచిది. ఈ విధంగా చేయడం వలన దిగుబడులు బాగా పెరుగుతాయి. డెల్టాతో పోల్చుకుంటే ఇక్కడ దిగుబడులు ఎక్కువగా వస్తున్నాయయనే చెప్పవచ్చు.

– ప్రగడ రాంబాబు, రైతు, నరేంద్రపురం

సరైన ప్రణాళికతో మంచి ఫలితాలు



సాగులో సైతం సరైన ప్రణాళికతో వెళితే మంచి ఫలితాలను అందుకోవచ్చని నరేంద్రపురం, కలవచర్ల, వెలుగుబంద, తూర్పుగానుగూడెం రైతులు నిరూపిస్తున్నారు. ప్రతి సీజన్‌లోను ఈ ప్రాంతంలో రైతులే ముందంజ వేయడానికి కారణం సకాలంలో సాగుకు సమయాత్తం కావడమే. ఈ ప్రాంతంలో రెండు, మూడు రోజులలో రబీ వరి కోతులు ప్రారంభం కావడం జరుగుతుంది.

– ఎస్‌కే ఇమామి ఖాసిం, మండల వ్యవసాయాధికారి, రాజానగరం

ఆన్‌లైన్ లింక్‌లను క్లిక్ చేస్తే అనేక అనర్థాలు



మాట్లాడుతున్న డీఎస్పీ కిషోర్ కుమార్

రాజానగరం: ఆన్‌లైన్‌లో వచ్చే లింక్‌లను క్లిక్ చేసి, అనర్థాలను కొనితెచ్చుకోవద్దని ఈస్ట్ జోన్ డీఎస్పీ ఎస్.కిషోర్ కుమార్ హెచ్చరించారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచికి వాడుకోవాలని, కానీ కొందరు తమ స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంటూ అమాయకులను బలిచేస్తున్నారన్నారు. సైబర్ నేరాలపై యువత పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. ఏ విషయంలోనూ ఇతరులకు వ్యక్తిగత బ్యాంకు అకౌంట్లు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు చెప్పరాదన్నారు. పొరబాటున ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలన్నారు. అలాగే మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేద్దాం.. ఘన విజయం సాధిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ కన్వీనర్లు, పార్టీ నేతలు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- బూత్ కమిటీ కన్వీనర్లతో సమావేశం

అనపర్తి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లోసమష్టిగా పనిచేసి ఘన విజయం సాధించి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి బూత్ కమిటీ కన్వీనర్ల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలపై బూత్ కన్వీనర్లు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయడంలో బూత్ కమిటీలు ప్రధాన భూమిక పోషించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలకతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన పారదర్శక పాలనపై ప్రజలకు వివరించాలని చెప్పారు. అవాస్తవాలు, అక్రమ పొత్తులతో అధికార పీఠాన్ని దక్కించుకోవడమే ధ్యేయంగా ప్రతిపక్ష పార్టీ నేతలు ఎన్నికలకు సిద్ధమయ్యారన్నారు. అయితే ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రధాన అజెండాగా ఎన్నికలకు సిద్ధమైన వైఎస్సార్ సీపీకి ప్రజల ఆశీస్సులే శ్రీరామరక్షగా నిలుస్తాయని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ఘన విజయమే లక్ష్యంగా రాబోయే 40 రోజులు పార్టీ నాయకలు, కార్యకర్తలు పూర్తి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కోరారు. సమావేశంలో రంగంపేట జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, పెదపూడి, రంగంపేట, బిక్కవోలు, అనపర్తి మండలాల వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా జక్కంపూడి కుటుంబం



జంబూపట్నం ఆటోనగర్ స్థలంలో కార్మికులతో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- జంబూపట్నంలో ఆటోనగర్ నిర్మిస్తాం
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండ మండలంలోని 115 మంది కార్మికుల ప్రయోజనార్థం ఆటోనగర్ నిర్మాణం చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. తన తండ్రి జక్కంపూడి రామ్మోహన రావు కార్మికుల పక్షాన నిలబడి, ఎన్నో పోరాటాలు సాగించారన్నారు. అలాగే ప్రతిపక్షంలో ఉండగా కార్మికులు జక్కంపూడి కుటుంబంతో ప్రయాణం చేశారన్నారు. తన తండ్రి ఆశయ సాధనలో భాగంగా, కార్మికుల శ్రేయస్సు కోసం జంబూపట్నంలో ఆటోనగర్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దీనివల్ల మండలంలోని 115 మంది మెకానిక్‌లకు మేలు జరుగుతుందన్నారు. ఆటోనగర్‌తో అన్ని వాహనాల మరమ్మతులు అందుబాటులోకి వస్తాయన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, కార్మిక పక్షపాతి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ గణేశుల పోసయ్య, మాజీ కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, గ్రామ సర్పంచ్ ఉల్లి అప్పన్నదొర, దేవి వెంకట మణిసాయి, ఆటో మెకానిక్ వర్కర్స్ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు సీరుకొండ బాబ్జీ, అధ్యక్షుడు పచారి వెంకటరమణ, ఉపాధ్యక్షుడు నల్లమిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజల జీవన ప్రమాణాల్లో విప్లవాత్మక మార్పు



కుతుకులూరులో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కుతుకులూరులో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ

అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పారదర్శక పాలనతో రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాల్లో విప్లవాత్మక మార్పు చోటుచేసుకుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కుతుకులూరులో నిర్వహించిన కార్యక్రమంలో నవరత్న పథకాలు.. పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా 455 మంది లబ్దిదారులకు నూతనంగా మంజూరైన ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నవశకానికి నాంది పలుకుతున్నాయన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు నివేశన స్థలాలు మంజూరు చేయడంతో పాటు ఇళ్లు నిర్మించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ఇప్పటికే రూపుదిద్దుకున్న జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లు హేమతులసి, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సత్తి దొరయ్యరెడ్డి, ఉపసర్పంచ్ సబ్బెళ్ల నాగిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, ఆర్కే, పడాల తమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహా గర్జన విజయవంతం చేయాలి

బిక్కవోలు: ఈ నెల 9వ తేదీన అమరావతిలో జరగనున్న దివ్యాంగుల మహా గర్జనను విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకురాలు పలివెల ఉమాదేవి పిలుపునిచ్చారు. మంగళవారం బిక్కవోలులో జరిగిన నియోజకవర్గ స్థాయి దివ్యాంగుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.6 వేలు చేయాలని, 200 యూనిట్ల కరెంట్ బిల్లులో రాయితీ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తాతలు బ్రహ్మానందరెడ్డి, నల్లమిల్లి సురేష్ రెడ్డి, కొవ్వూరి హరినాథ్‌రెడ్డి, బొంక సత్తి బాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.223 కోట్లతో 170 కిలోమీటర్ల రోడ్లు



బూరుగుపూడి జంక్షన్ నుంచి రాజానగరం వరకూ నిర్మించిన రహదారి

మధురపూడి: నియోజకవర్గంలో రూ.223.57 కోట్లతో 37 పనుల ద్వారా 170 కిలోమీటర్లు రోడ్లు నిర్మించినట్టు రోడ్లు, భవనాల శాఖ డీఈ బీవీ మధుసూదనరావు తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ రోడ్లతో నియోజకవర్గానికి నూతన కళ వచ్చిందన్నారు. కోరుకొండ నుంచి సీతానగరం మండలం ముగ్గళ్ల వరకూ 14.3 కిలోమీటర్లు రహదారి నిర్మాణం జరుగుతోందన్నారు. బూరుగుపూడి జంక్షన్ నుంచి రాజానగరం వరకూ పది కిలోమీటర్ల రోడ్డు నిర్మించామన్నారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థులను చైతన్యపరచాలి



విద్యార్థులతో ముచ్చటిస్తున్న సమగ్ర శిక్ష ఐఈ కోఆర్డినేటర్ కనకబాబు

రంగంపేట: సామాన్య విద్యార్థులతో పాటు సమానంగా విద్యాభ్యాసం చేసేలా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను, వారి తల్లిదండ్రులను చైతన్యపరచాలని జిల్లా సమగ్ర శిక్ష ఐఈ కోఆర్డినేటర్ ఎన్.కనకబాబు సూచించారు. స్థానిక భవిత కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రత్యేక అవసరాల విద్యార్థులకు అవసరమైన ఉపకరణాల పంపిణీ కోసం ప్రత్యేక మెడికల్ అసెస్మెంట్ క్యాంపులు నిర్వహించడంతో పాటు టీఎల్‌ఎం కిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. వారానికి ఒక రోజు ఫిజియోథెరపీపై శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.సూర్యకృష్ణ, ఉపాధ్యాయుడు మణికంఠ పాల్గొన్నారు.

ఉచిత ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి



ఎంఈఓ-2 నల్లమిల్లి సత్తిరెడ్డి

అనపర్తి: 2024–2025 విద్యా సంవత్సరంలో మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశానికి సంబంధిత విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి–2 నల్లమిల్లి సత్తిరెడ్డి తెలిపారు. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం–2009 ప్రకారం అన్ని ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేదలకు ఉచితంగా ఇవ్వాలని తెలిపారు. దీంట్లో భాగంగా అనాథలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, విభిన్న ప్రతిభావంతుల పిల్లలకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీ, పేదలైన ఓసీలకు 6 శాతం మొత్తం 25 శాతం అడ్మిషన్లు కేటాయించనున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన కుటుంబాల సంవత్సర ఆదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంత కుటుంబాలకు రూ.1.40 లక్షలు లోబడి ఉన్న వారు అర్హులన్నారు. దీనికి అనుగుణంగా తమ నివాస ప్రాంతంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి ఉచిత ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దీనికోసం ఈ నెల 25లోగా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 1800 4258 599 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

నరసింహస్వామి ఆలయంలో సుదర్శన యాగం



యాగం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆయన సతీమణి రాజశ్రీ

మధురపూడి: కోరుకొండలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో మంగళవారం అష్టముఖ గండ భేరుండ లక్ష్మీనరసింహస్వామి సుదర్శన యాగం ప్రారంభమైంది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆయన సతీమణి రాజశ్రీ చేతుల మీదుగా నిర్వహించారు. మూడు రోజులు పాటు ఈ యాగం జరగనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కోరుకొండలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా విలేకరులతో మాట్లాడుతూ లోక కల్యాణార్థం ఈ యాగాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

నేడు కల్యాణ మహోత్సవం



కాపవరంలోని విశ్వేశ్వరస్వామి

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు కార్యనిర్వాహణాధికారి పాటి సత్యనారాయణ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఏకాదశిని పురస్కరించుకుని కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ఈ నెల 8వ తేదీన మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు.

సంక్షేమ సారథి సీఎం జగన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- పార్టీ బూత్ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం

మధురపూడి: వైఎస్సార్ సీపీ విజయానికి 40 రోజులు కృషి చేసి, ఐదేళ్ల పాటు జక్కంపూడి కుటుంబం సేవలను అందుకోవాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా విజ్ఞప్తి చేశారు. కోరుకొండలోని ఆయన నివాసంలో మంగళవారం పార్టీ బూత్ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు ధర్మానికి అధర్మానికి మధ్య జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలోని పేదలకు సంక్షేమ పథకాలను నేరుగా అందిస్తూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారన్నారు. అదే స్ఫూర్తితో నియోజకవర్గంలో రూ.1,158 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించామని, రూ. 1,145 కోట్లతో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించినట్టు తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కో కన్వీనర్ గణేశుల పోసయ్య, మాజీ కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, నాయకులు కడియాల పాపారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతులను చైతన్యపర్చడం కోసమే ఏరువాక

రాజానగరం: మండలంలోని రైతాంగాన్ని చైతన్యపర్చడం కోసమే దివాన్ చెరువులో ఏరువాక కేంద్రం పనిచేస్తుందని ఆ కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. ఇటీవల బదిలీపై వచ్చిన ఆయన రాజానగరం, రంగంపేట మండలాలలో సాగు చేస్తున్న శనగ, వరి పంటలను మంగళవారం పరిశీలించి, రైతాంగానికి సూచనలిచ్చారు. వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు మంచి దిగుబడులు పొందవచ్చన్నారు. శనగ పంటకు చీడపీడల బెడద లేకపోవడంతో ప్రస్తుతం మంచి దిగుబడులొస్తున్నాయన్నారు. అయితే ఈ మండలాలలో ఎక్కువగా వరి పంట అంకురం దశలో ఉందన్నారు. అక్కడక్కడా కాండం తొలిచే పురుగు ఆశిస్తున్నట్టుగా చూశామన్నారు. దీని నివారణకు పొలం బురద పదునులో ఉండగా కార్బోఫ్యురాన్ గుళికలు 10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 8 కిలోలు లేదా క్లోరంట్ర నిలిప్రోల్ 4 కిలోలు 20 కిలోల ఇసుకలో కలిపి చల్లాలని, మరునాడు నీటిని పెట్టాలని సూచించారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

గోకవరం: రానున్న విద్యా సంవత్సరంలో ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గోకవరం ఎంఈఓ బి.గౌరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనాథలు, హెచ్ఐవీ బాధిత, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం కోటా కింద ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దీనికి ఈ నెల 25 వరకూ గడువు ఉందని, అర్హత ఉన్న విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు టోల్‌ఫ్రీ నంబర్ 18004258599కు ఫోన్ చేయాలన్నారు.